హైదరాబాద్ వార్త






-బల్దియా సమావేశాల్లో బిఆర్ఎస్ పాత్ర పై చర్చ
-మీటింగ్‌లో ఎలా వ్యవహరిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి
-మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీ మార్పుతో మారిన సీన్
-రేపు జిహెచ్ఎంసి సర్వసభ్య సమావేశం

# పోరాటమా ... నామమాత్రమా ..!

**హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పాలకమండలిలో బిఆర్ఎస్ కార్పొరేటర్ల పరిస్థితి ప్రస్తుతం ఏంటన్నది ఆసక్తి రేపుతుంది. ఆపార్టీ కార్పొరేటర్లు ఇప్పుడు తాము అధికర పక్షమా..ప్రతిపక్షమా అని తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో రేపు జరిగే పాలక మండలి సర్వసభ్య సమావేశంపై బిఆర్ఎస్ కార్పొరేటర్లకు గులాబి పెద్దలు ఎలాంటి సూచనలు చేస్తారన్నదానిపై సర్వత్రా ఆసక్తి రేపుతుంది. సాంకేతికంగా బిఆర్ఎస్ పార్టీ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నా..మారిన రాజకీయ పరిస్థితులతో ఆపార్టీ కార్పొరేటర్లు ఎలా వ్యవహరిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. 2019లో రెండోసారి అధికారం చేపట్టిన బిఆర్ఎస్ మెజార్టీ స్థానాలను గెలుచుకుని గ్రేటర్‌పీఠంపై గులాబిజెండా ఎగువేసింది. మేయర్‌గా కేకే కూతురు బంజారాహిల్స్ కార్పొరేటర్ గద్వాల విజయలక్ష్మికి అవకాశం కల్పించగా ..డిప్యూటీ మేయర్‌గా తార్నాక కార్పొరేటర్ మోతే శ్రీలతారెడ్డిరెడ్డిని ఎంపిక చేసింది. ఈనేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ముందు అంతా సవ్యంగానే సాగినా ఆతర్వాత పరిస్థితులు బిఆర్ఎస్‌ను గంగదరగోళానికి గురిచేస్తుసుంది.

## కౌన్సిల్ సమావేశాల్లో నామమాత్రమే ..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ..బిఆర్ఎస్ కుపార్టీకి చెందిన మేయర్, డిప్యూటీ మేయర్ కాంగ్రెస్ గూటికి చేరారు. వీరితోపాటు మరికొంత మంది హస్తంగూటికి వచ్చారు. అలాగే కాంగ్రెస్ అధిష్టానం సైతం బిఆర్ఎస్ కార్పొరేటర్లను అధిక సంఖ్యలో కాంగ్రెస్‌లో చేర్చుకునేలా పావులు కదుపుతుంది. ఎన్నికలకు సమయం ఉండటంతో రాబోయే రోజుల్లో మరికొంతమంది కార్పొరేటర్లు కూడా అధికారపార్టీలో చేరే అవకాశం కన్పిస్తుంది. అలాగే నగరంలో కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే కూడా లేకపోవడంతో ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి తమ పార్టీలో కలుపుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతుంది. అందులో భాగంగానే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను చేర్చుకుని సికింద్రాబాద్ ఎంపిగా పోటీ చేయించింది. అలాగే మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,ఆయన సతీమణి కార్పొరేటర్ శ్రీదేవీ అలాగే డిప్యూటీ మేయర్ బాబా ఫసుయుద్దీన్ సైతం పార్టీలో చేర్చుకుంది. మరికొంతమంది ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్‌కు టచ్‌లో ఉన్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో గ్రేటర్ సర్వసభ్య సమావేశాల్లో బిఆర్ఎస్ పాత్ర నామమాత్రంగానే మారిపోయే ఛాన్స్ కనిపిస్తుంది.

## అవిశ్వాసం పెట్టే అవకాశం లేదు..

అయితే బిఆర్ఎస్‌కు మోజార్టీ సభ్యుల బలం ఉన్నప్పటికీ పార్టీ మారిన మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అవకాశం లేదు. నాలుగేళ్లు పూర్తయితేనే ఆఅవకాశం ఉంటుంది. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వరకు ఎలాంటి అవిశ్వాసం పెట్టేందుకు సభ్యులు అవకాశం లేదు. దీంతో మరోఏడాది వరకు బిఆర్ఎస్ కార్పొరేటర్లు మేయర్, డిప్యూటీ మేయర్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ డివిజన్లలో పనులు చేయించుకోవాలంటే వారితో సన్నిహితంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సాంకేతికంగా బిఆర్ఎస్ అధికారపీఠంపై ఉన్నా దాని ప్రభావం నామమాత్రంగానే ఉండనుంది. ఇక గ్రేటర్‌లో చక్రం తిప్పే ఎంఐఎం పార్టీ అధికార కాంగ్రెస్ పార్టీతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతుంది. ఈకారణంగా కౌన్సిల్ సమావేశాల్లో బిఆర్ఎస్ ఒంటరిగానే తమ గళాన్ని వినిపించాల్సిన పరిస్థితి నెలకొంది.

# డెంగీ..డేంజర్ బెల్స్

-ఒకేసారి 4 వేరియంట్లు దాడి -నగరాన్ని వణికిస్తున్న విష జ్వరాలు -ఆసుపత్రుల్లో పెరుగుతున్న బాధితులు
-ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో కిక్కిరిసిన రోగులు -ముందస్తు జాగ్రత్తతోనే నివారణ సాధ్యం

**హైదరాబాద్, జూలై 4 ప్రభాతవార్త** డెంగీ ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.గ్రేటర్‌లో కొంత కాలంగా డెంగీ పాజిటివ్ కేసుల సంఖ్య అధికమవుతోంది.ఈ సీజన్‌లో తెలంగాణకు డెంగీ ముప్పు పొంచి ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. కేసుల తీవ్రత ఈసారి ఎక్కువగా ఉంటుందని తెలిపింది. దేశంలో డెంగీ ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉన్నట్టు పేర్కొంది. డెంగీలోని నాలుగు ప్రధాన వేరియంట్లు తెలంగాణలోనే కనిపిస్తున్నాయని వెల్లడించింది. డీఈఎన్‌వీ1, డీఈఎన్‌వీ2, డీఈఎన్‌వీ3, డీఈఎన్‌వీ4 ప్రభావం ఎక్కువగా ఉంటున్నట్టు డబ్ల్యూహెచ్‌ఓ పేర్కొంది. కొన్నిసార్లు రెండుమూడు వేరియంట్లు కూడా ఒకేసారి దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించింది. ఫలితంగా డెంగీ బాధితులు తీవ్రమైన ఇబ్బందులు పడతారని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రుల్లో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి, బోడుప్పల్, పిర్జాదిగూడ, దుండిగల్, నిజాంపేట తదితర నగర శివారు మున్సిపాలిటీల్లో దోమల నివారణకు చర్యలు నామమాత్రంగా కనిపిస్తున్నాయని నగరవాసులు పేర్కొంటున్నారు.ఈ వ్యాధులకు ప్రదాన కారణం దోమలు అని తెలిసి వాటిని పూర్తిగా నివారించి ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అధికారులు నామమాత్రపు చర్యలు చేపడుతూ చేతులు దులుపుకుంటున్నారు. విషజ్వరాలు డెంగ్యూ బారినపడుతున్నది ఎక్కువగా మురికివాడలకు చెందిన పిల్లలే కావడంతో వారిలో పేద వారు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆశ్రయిస్తుండగా, కొద్దిగా స్తోమత ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నరు.

అడుగడుగునా చెత్తకుప్పలు, డ్రైనేజీ మురుగుతో రోడ్లు కంపు కొట్టడానికి తోడు ఎడతెరిపిలేని వర్షాలతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో జనానికి కంటిమీద కునుకు కరువవుతోంది. ఇటీవల వర్షాలు కురుస్తుండడం, వాతావరణం చల్లబడడం.. వెరసి దోమలు వృద్ధి చెందడానికి అనుకూల




వాతావరణం ఏర్పడింది. దీంతో కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా విషజ్వరాలతో బాధపడుతున్నవారి సంఖ్య ఒక్కసారిగా గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్న జ్వర పీడితుల్లో 50 శాతానికి పైగా డెంగీ బాధితులే ఉంటున్నారని తెలుస్తోంది. ఫీవర్, నిలోఫర్, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు వివిధ రకాల జ్వరాలతో వస్తున్న వారి సంఖ్య అధికమైంది. సాధారణ రోజుల్లో ఫీవర్ ఆస్పత్రికి ఓపి 600 నుండి 800 మంది వరకు వస్తుంటారు. ఇటీవల ఆ సంఖ్య 900లకు పైగా ఉంటోందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. వాతావరణ మార్పులతో వైరల్, ఇతరత్రా జ్వరాలు వ్యాప్తి చెందుతు న్నాయి. నగరంలో ఫీవర్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల వద్ద రోగుల రద్దీ విపరీతంగా ఉంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు డెంగీ బారిన పడుతున్నారు. విషజ్వరాలతో, డెంగ్యూతో చిన్న పిల్లలు ఎక్కువగా ఆస్పత్రులు పాలవుతున్నారు. నిలోఫర్, పీవర్ ఆస్పత్రులలో పాటు ప్రైవేటు ఆసుపత్రులలో విషజ్వరాలు, డెంగ్యూ బారినపడిన వారు చికిత్స పొందుతున్నారు.విష జ్వరాలో అంత పెద్ద ప్రమాదం లేప్పటికీ డెంగ్యూతో పెద్ద ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

డెంగ్యూ జ్వరం 'ఏడిస్ ఈజిప్ట్' అనే ఆడ దోమ పగటి పూట నొప్పిరాకుండా కుట్టడం వల్ల వస్తుం దని, నియో బిబిసి చిల్డ్రన్ ఆస్పత్రి ఎండి, ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ మంజుకొండ రంగయ్య పేర్కొన్నారు. డెంగ్యూ బారిన పడ కుండా పిల్లలకు పూర్తి రక్షణ కల్పించాలని ప్రతి ఇంటిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. డెంగ్యూ వ్యాధికి కారణం, వ్యాధిరా కుండా తీసుకునే జాగ్రత్తలను ఆయన వివరించారు.

## డెంగ్యూ లక్షణాలు..

డెంగ్యూ వ్యాపించినప్పుడు చలితో అతి జ్వరం మొదలవుతుంది. ఒళ్లు నొప్పులు, ఎముకల నొప్పులు ఉంటాయి. విపరీతమైన తలనొప్పి, కనుగుడ్లు లాగడం, శరీరం కమిలిపోవడం, శరీరంపై దుద్దులు రావడం, చిన్న పిల్లలకు గొంతు నొప్పి, వాంతులతో మొదలు కావచ్చు. ఈ జ్వరాన్ని అశ్రద్ధ చేస్తే రెండవ స్టేజికి డెంగ్యూ హేమరేజిక్ పీవర్‌గా మారుతుందని డాక్టర్ రంగయ్య వివరించారు. డెంగ్యూ హేమరేజ్ ఫీవర్‌గా మారితే రక్తస్రావం కావడం, శరీరం నుంచి చిగుర్ల ద్వారా ముక్కు ద్వారా, చిన్న పేగులతో, మూత్రపిండాలలో, చర్మంలోగాని రక్తస్రావం కావచ్చని తెలిపారు. అతిగా కడుపులో నొప్పి, వాంతులు, హై ఫీవర్ లక్షణాలు ఉంటాయని తెలిపారు. ఊపిరితిత్తులలో నీరు రావడం, బిపి తగ్గిపోవడం, నాడిబలహీనం కావడం, శ్వాస ఇబ్బందిగా ఉండడం, ఇతర అవయవాలు చెడిపోయే అవకాశం ఉంటుందన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు

**సంజీవరెడ్డి నగర్, జూన్ 4, ప్రభాతవార్త** బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ ఈఓ అంజినీదేవి, చైర్మన్ సాయిబాబాగౌడ్‌లు గురువారం వివిధ శాఖల ఏర్పాట్లపై విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 8,9,10వ తేదీలలో అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా లక్షలాది మంది నడుమ కన్నుల పండుగగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతం సంవత్సరం ఏర్పాటు చేసిన దగ్గరే కళ్యాణ వేదిక దేవస్థానం రాజగోపురం ముందు గల ప్రధాన రహదారి యందు కళ్యాణ వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 8వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపన దేవత ఆహ్వానం అంకురార్పణ, ఎదురుకోళ్ళు, 9వ తేదీన మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు నాదస్వర మంగళ వాయుద్యములు అమ్మవారికి అభిషేకం, ఉదయం 9 గంటలకు అమ్మవారి కళ్యాణం జరుగుతుందని, 10వ తేదీన బుధవారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులకు కళ్యాణం టికెట్ ధర రూ. 2500, ఈ టికెట్‌పై దంపతులు పాల్గొనవచ్చని ఈటికెట్లు దాదాపుగా 300 ఇస్తున్నట్లు తెలిపారు. క్యూలైన్లకోసం ఏర్పాటు చేసని బారికేడ్లకు 100 ఫీట్లకు (30 మీటర్లకు) ఒక్కచోట ఎమర్జెన్సీ గేట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపులను దాదాపుగా ఆరుచోట్ల అమర్చినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం వాహనాల పార్కింగ్ నేచర్ క్యూర్ హాస్పిటల్ దగ్గర నిలుపుకునేల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు రంగు రమేష్, హైమవతి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ అంజినీదేవి, చైర్మన్ సాయిబాబాగౌడ్

## హైదర్షాకోట్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

**నార్సింగి, జూలై 4 ప్రభాతవార్త :** అనుమానాస్ద స్థితిలో ఓ వ్యక్తి కారులో మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీం నగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్(40) గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామం వెస్టర్న్‌కాలనీలో భార్య, ఇద్దరు బిడ్డలతో నివాసముంటున్నాడు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత మూడు రోజుల నుంచి ఇంటికి రావడం లేదు. గురువారం మధ్యాహ్నం కారులో నుంచి దుర్వాసన వస్తుండడంతో అద్దంలోకి తొంగి చూశారు. ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారు అద్దాలు పగులగొట్టి మృతదేహంను బయటకు తీశారు. మృతుడి ఒంటిపై స్వల్ప గాయాలు ఉన్నాయని, ఎవరో కొట్టి చంపారని మృతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతుడి భార్య బిడ్డలు గుండెలవిసేలా రోధించారు. మృతుడు మద్యం సేవించి కారులో ఏసీ ఆన్ చేసుకొని పడుకుని ఉంటాడని, డీజిల్ అయిపోయి కారు ఆగిపోయిందని, ఆక్సీజన్ అందకనే మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకనే మృతుడు ఎలా చనిపోయాడన్నది తేలుతుందని పోలీసులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు, భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి వివరించారు.

## ఉరేసుకొని ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**నార్సింగి, జూలై 4 ప్రభాతవార్త :** తీసుకున్న అప్పులు చెల్లించలేక ఓ ఇంజనీరింగ్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ ప్రాంతానికి చెందిన మోహన్ సిబిఐటి కళాశాలలో డ్రైవర్‌గా పని చేస్తూ, గండిపేట మండలం పీరంచెరువు ప్రాంతంలో నివాసముంటున్నాడు. ఇతడి కుమారుడు సందీప్(21) మొయినాబాద్‌లోని జేబీఆర్‌సిలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. తరుచూ స్నేహితుల వద్ద తన అవసరాల కోసం డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి ఇవ్వకపోవడంతో వాళ్లు ఇంటి వరకు వచ్చి గొడవపడ్డారు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్థాపం చెంది తనుంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహంను ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కారులో తరలిస్తున్న 27 కిలోల గంజాయి స్వాధీనం

**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 4 ప్రభాతవార్త:** గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తుని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారు జామున పెద్ద అంబర్పేట్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఒడిస్సా రాష్ట్టానికి చెందిన ఒక వాహనం అనుమానాస్పదంగా కనపడడంతో పోలీసులు వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 27 కిలోల సంబంధించిన 36 ప్యాకెట్లలో గంజాయినీ గుర్తించారు. వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురిని అదుపులో తీసుకొని విచారిం చగా ఒడిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లాకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. బలరాం దారి, రాజు కపస్య, విజయ్ హల్దర్ మరో మైనర్ బాలుడు ఉన్నట్టు గుర్తించారు. వారి వద్ద ఉన్న సుమారు 27 కిలోలకు సంబంధించిన 37 గంజాయి ప్యాకెట్లను తోపాటు వారు ప్రయాణిస్తున్న కారు ఐదు సెల్ ఫోన్ ను స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

## అధికారులు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

-దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
-జోనల్ కమిషనర్లకు జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం




జోనల్ కమిషనర్లతో సమావేశమైన కమిషనర్ ఆమ్రపాలి

**హైదరాబాద్, జూలై 4,ప్రభాతవార్త:** జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట జోనల్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం తన ఛాంబర్‌లో జోనల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జోనల్ కమిషనర్‌లతో పాటు డిప్యూటీ కమిషనర్లు కూడా తమతమ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన నివేదికతో పాటు సంబంధిత ఫోటోలు కూడా పంపించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఒకొక్క అంశంపై ప్రజలకు వివరించడమే కాకుండా మీడియాలో కూడా ఆవిషయం వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ నివారణకు ప్రత్యేక దృష్టి సారించాలని అవసరమనుకుంటే అందుకు ఐఈసి కార్యక్రమం ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత ఎంటమాలజీ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి దోమల నివారణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా ప్రతి శుక్రవారం డ్రైడేగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెలా కేటాయించిన టాక్స్ వసూలు చేయాలని, టాక్స్ వసూలు చేసిన శాతం ప్రకారం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈసమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, రవి కుమార్, ఉపేందర్‌రెడ్డి, పంకజ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సిఐ, ఇద్దరు ఎస్సైల పై సస్పెన్షన్ వేటు

**బేగంపేట జులై 4,ప్రభాతవార్త :** దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సిఐ ఇద్దరు ఎస్సైల పై హైదరాబాద్ పోలీస్ కమీషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్ వేటు వేసారు.ఈ మేరకు ఆయన బుధవారం ఆదేశాలు జారీ చేసారు. అందిన సమాచారం మేరకు 2023లో మహంకాళీ ఇన్స్‌పెక్టర్‌గా కావేటి శ్రీనివాసులు,ఎస్సైలుగా బి.భాస్కరరావు,జి.రాకేష్‌లు పనిచేస్తున్నారు.ఈ సమయంలో చంద్రలోక్ కాంప్లెక్సులో ఓ కేసు విషయంలో ఇన్స్‌పెక్టర్‌తో పాటు ఎస్సైలు కేసు దర్యాప్తును సక్రమంగా నిర్వహించలేదని,ఆరోపణలు వచ్చాయి.ఈ విషయంలో ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టి నివేదికను అందజేసారు.ఈ మేరకు నగర పోలీస్ కమీషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి వారిని సస్పెన్షన్ చేస్తూ ఆదేశాలు జారీ చేసారు.వీరిలో కావేటి శ్రీనివాసులు ఎస్‌బి సిటీలో విధులు నిర్వర్తిస్తుండగా,జి.రాకేష్ మహంకాళీ సిక్ లీవ్‌లో ఉండగా,భాస్కరరావు ఛార్మినార్ పీఎస్ లో విధులు నిర్వర్తిస్తున్నారు.

# జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 8అంశాలకు ఆమోదం

-రోడ్లు, జంక్షన్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం
-కల్నల్ సంతోష్ బాబు భార్యకు 711 గజాల స్థలం కేటాయిస్తూ తీర్మానం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

**హైదరాబాద్, జూలై 4,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో 8అంశాలు, ఒక టేబుల్ ఐటెంకు ఆమోదం తెలిపినట్లు జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. ఈమేరకు గురువారం మేయర్ అధ్యక్షతన 3వ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆమోదించిన 8అంశాల్లో రోడ్లు,జంక్షన్ల అభిభివృద్ధికి సంబంధించి ఆమోదం తెలిపినట్లు వివరించారు.

**1.** జిఐఎస్ ఆధారిత సర్వే అమలు, ప్రాపర్టీ, యుటిలిటీల మ్యాపింగ్ కోసం నియో,జియో ఇన్ఫోటెక్నాలజీ ఏజెన్సీకి కేటాయిస్తూ కమిటీ ఆమోదం, అదనపు రెండు సంవత్సరాలు అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్, నిర్వహణ ఖర్చు వినియోగ అనుమతి కోసం ప్రభుత్వానికి సిపార్సు చేసేందుకు కమిటీ ఆమోదం.

**2.** పైప్‌లైన్ రోడ్‌నుంచి కుత్బుల్లాపూర్ మెయిన్ రోడ్ వయా వెన్నెల గడ్డ చెరువు వరకు ప్రతిపాదిత 18మీటర్లు , 9మీటర్ల వెడల్పు పైప్‌లైన్ రోడ్డు నుంచి గజానన్ ఎన్‌క్లేవ్ వరకు 18రోడ్డు వెడల్పుకు , వెన్నల గడ్డ చెరువు కట్ట నుంచి గోదావరి హోమ్స్,గాయత్రి నగర వరకు ప్రతిపాదిత 12 మీటర్ల రోడ్డు వెడల్పునకు ప్రభావితమవుతున్న 105 అంతస్తులను ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్‌లో ఆర్‌డిపిలను చేరుస్తూ ప్రభుత్వానికి పంపేందుకు ఆమోదం.

**3.** కిషన్‌బాగ్ జంక్షన్ ,ఇండియానా హోటల్ నుంచి రోడ్‌నెంబర్ 9 చింతల్‌మెట్ మీదుగా పిల్లర్ నెంబర్ 202 వరకు ప్రతిపాదిత 30మీటర్ల రోడ్డు వెడల్పుకు ప్రభావితమయ్యే 418 ఆస్తుల సేకరణకు, ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్ రోడ్డు వెడల్పు 24మీటర్ల నుంచి 30మీటర్ల వరకు పెంచడం కొరకు ప్రభుత్వానికి సిపార్స్‌కు ఆమోదం.

**4.** బార్కస్ డివిజన్ మజీద్ ఇ-నూర్ ఇస్మాయిల్ నగర్ నుంచి బిస్మిల్లా కిరాణాస్టోర్, అహ్మద్‌నగర్ ,బండ్ల గూడవరకు ప్రతిపాదిత 18మీటర్ల రోడ్డు వెడల్పు కు ప్రభావితమయ్యే 153 ఆస్తులను మాస్టర్ ప్లాన్‌లో చేర్చి ఆమోదం కొరకు ప్రభుత్వానికి పంపేందుకు కమిటీ అమోదం.

**5.** చాదర్‌ఘాట్ మూసీ వద్ద మూసినదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం కోసం జైల్‌గార్డెన్‌నుంచి రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు ప్రతిపాదిత 12.4మీటర్లు, 21మీటర్ల, 36 మీటర్ల రోడునడ వెడల్పుకు ప్రతిపాదిత 21మీటర్ల వంతెన నిర్మాణంలో ప్రభావితమయ్యే 35 ఆస్తులు సేకరణ, రోడ్డు వెడల్పు పెంచడానికి ,మాస్టర్‌ప్లాన్‌లో అలైన్‌మెంట్‌ను మార్చడానికి ఆమోదంకొరకు ప్రభుత్వానికి సిఫార్స్ చేసేందుకు కమిటీ ఆమోదం.

**6.** ఉప్పర్‌పల్లి పివిఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేపిల్లర్ నెంబర్ 178 నుంచి సన్‌రైజ్ కాలనీ ధాని రెసిడెన్సి , సన్‌రైజ్ వ్యాలీ వరకు ప్రతిపాదిత 12మీటర్ల రోడ్డు వెడల్పుకు ప్రభావితమయ్యే 67 ఆస్తుల సేకరణకు మాస్టర్‌ప్లాన్‌లో చేర్చి ప్రభుత్వం ఆమోదం కొరకు పంపేందుకు ఆమోదం.

**7.** రివైజ్డ్ సిఎస్ఆర్ ప్రతిపాదనలతో జంతు సంరక్షణ కేంద్రం నిర్మాణ పనులను మెస్సర్స్ రాంకీ ఫౌండేషన్ వారికి సిఎస్ఆర్ కింద సొంతనిదులు చేపట్టి ఎన్‌జివో ఆల్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్‌కు ప్రతిపాదించిన కావాల్సిన వైద్య సదుపాయాలను కల్పించి స్వాధీనం చేయుటకు (15) ఏళ్ల కాలానికి లీజుకు ఇవ్వడానికి ప్రభుత్వానికి అనుమతి కొరకు సిపార్స్ చేసేందుకు కమిటీ ఆమోదం.

**8.** ఎస్ఆర్‌డిపి పథకం కింద మేజర్ రోడ్ డెవపల్‌మెంట్ అప్‌గ్రేడ్‌లో భాగంగా 60అడుగుల వెడల్పుతో జోహ్రా బీ దర్గా జంక్షన్ అభివృద్ధి, విస్తకరణకు 5.50కోట్ల ఖర్చు చేసిన మొత్తానికి స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలుపుతూ ,కార్పొరేషన్ అడ్మినిస్ట్రేషన్ ర్యాటిఫికేషన్‌కు ఆమోదం. అలాగే టేబుల్ ఐటెంగా 2020 ఇండో చైనా యుద్ధంలో అమరుడైన కల్నల్ సంతోష్‌బాబు భార్య సంతోషికి బంజారాహిల్స్‌లోని రోడ్‌నెంబర్ 14లోని 711గజాల స్థలాన్ని కేటాయిస్తూ స్టాండింగ్ కమిటీ తీర్మాణం చేసింది.

## శానిటేషన్‌పై జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కూకట్‌పల్లి, మూసాపేట్ భరత్‌నగర్, రైతుబజార్ ప్రాంతాల్లో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వీధులల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా ఎప్పటికప్పుడు చెత్తలేకుండా శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ (జివిపి)ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అంతేకాకుండా ఖైరతాబాద్ , ఎల్‌బినగర్ ,సికింద్రాబాద్ జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్‌పాటిల్, రవికిరణ్ శానిటేషన్‌పై ఆయా ప్రాంతాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆమ్రపాలి

## ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటిన గురువు స్వామి వివేకానంద : డిప్యూటీ మేయర్


స్వామి వివేకానంద వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

**తార్నాక, జులై 4 ప్రభాతవార్త:** భారతీయ ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటి చెప్పి గురువు స్వామి వివేకానంద అని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. స్వామి వివేకానంద వర్థంతి సందర్భంగా తార్నాక డివిజన్ లాలాపేట్‌లోగల స్వామి వివేకానంద విగ్రహానికి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన ఉపన్యాసాలతో ప్రజలను జాగృతం చేసిన మహా మేధావి, యువతకు స్ఫూర్తిదాత వివేకానంద అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయాలి

### -రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్


రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న బిజెపి గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్ తదితరులు

**చిక్కడపల్లి, జులై 4 ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వాటిని ప్రజలు వినియోగించుకునే విధంగా చూసే బాధ్యత బిజెపి కార్యకర్తలు, నాయకులపైనే ఉందని రాజ్యసభ సభ్యుడు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు రత్నాసాయిచంద్ ఆధ్వర్యంలో డివిజన్‌లో డాక్టర్ లక్ష్మణ్ నివాసంలో ఆయనను కలిశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేతలు ఓ.శ్రీకాంత్, ఆకుల సురేందర్, కృష్ణప్రసాద్, శివకృష్ణ, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు పార్టీ చేరువ చేసే విధంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు.

## భాగ్యారావు కుటుంబానికి టివైజెఎఫ్ అండ

### -రాష్ట్ర అధ్యక్షుడు తనుగుల జితేందర్‌రావు

**చిక్కడపల్లి, జులై 4 ప్రభాతవార్త:** పాత్రికేయుడు భాగ్యారావు కుటుంబానికి టివైజెఎఫ్ అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తనుగుల జితేందర్‌రావు అన్నారు. విద్యానగర్‌లో ఆయన నివాసంలో ఆయన మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా డాకూర్ గ్రామానికి చెందిన భాగ్యరావు కొంతకాలంగా పాత్రికేయుడిగా, టివైజెఎఫ్ సభ్యుడిగా ఉంటున్నారని, ఆయన మరణం యూనియన్‌ను తీరనిలోటని టివైజెఎఫ్ చాంబర్స్ కమిటీ చైర్మన్ పి.వి.ప్రభాకరావు సంతాపం తెలిపారు. విషయం తెలుసుకుని గురువారం భాగ్యారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. ఆ కుటుంబానికి ఏ ఆపద వచ్చినా తమ యూనియన్ ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టివైజెఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చాపల సత్యం, నాయకులు నాగరాజు, శ్రీనివాస్, అర్జున్, టి.సంగమేశ్వర్, లోకేష్, రాజు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు నిలిపి వేయాలని వినతి


ప్రైవేటు వెంచర్ వేస్తున్న డ్రైనేజి పనులు నిలిపి వేయాలని కోరుతూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

**నార్సింగి, జులై 4 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని హుడాకాలనీలో ఓ ప్రైవేటు వెంచర్ చేస్తున్న డ్రైనేజి పనులు నిలిపి వేయాలని కోరుతూ ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావ్, ఆరిఫ్ మహ్మద్, లక్ష్మణ్ రావ్‌లు గురువారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ దాసరి జాన్ శాంసన్‌కు వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు వెంచర్ వారు నిర్మిస్తున్న డ్రైనేజి పనులతో హుడా కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన సదరు పనులను వెంటనే నిలిపివేసి, ప్రజలను ఇబ్బందుల పాలు కాకుండా కాపాడాలని అధికారులను కోరామన్నారు. మా విన్నపంకు స్పందించి వెంటనే రీజినల్ డైరెక్టర్, మున్సిపల్ కమీషనర్లకు ఫోన్‌లు చేసి డ్రైనేజి పనులను ఆపాలని ఆదేశించారని వివరించారు. మా సమస్య పట్ల వేగంగా స్పందించిన అధికారులకు ప్రత్యేక ధన్యావాదాలు తెలుపుతున్నామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో అందె లక్ష్మణ్‌రావ్, కౌన్సిలర్ పద్మారావ్ తదితరులు ఉన్నారు.

## ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన పోల్కం శ్రీనివాస్


ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి బొకె అందచేస్తున్నసీనియర్ కాంగ్రెస్ నాయకులు పొల్కం శ్రీనివాస్

**బేగంబజార్,జూలై 3ప్రభాతవార్త:** మేరు కులస్థులకు రాజకీయ రంగంలో గుర్తించాలని కోరుతూ తెలంగాన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను తెలంగాణ స్వాతంత్ర సమరయోధుల వారసుడు,కాంగ్రెస్ కమిటి ప్రధాన కార్యదర్శి పోల్కంశ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ మేరకు ఎంఎల్‌సి,చైర్మన్ పదువుల్లో తనకు అవకాశం కల్పించాలని కోరారు.పార్టీలో సుమారు 30సంవత్సరాలుగా కొనసాగుతున్నట్లు చెప్పారు.ముఖ్యంగా మేరుకులస్థులకు రాజకీపరంగా గుర్తింపు ఇవ్వాలని కోరారు.అందుకు ఉపముఖ్యమంత్రి మల్లుభట్టివిక్రమార్క హామిఇచ్చినట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి ధైర్యాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రాజేశ్వరరావు


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వర్మ


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి

**వివేకానందనగర్ కాలనీ, జులై 4, ప్రభాతవార్త :** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశభక్తి, ధైర్య సాహసాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. గురువారం అల్లురి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి ఉషా ముల్లపూడి హాస్పిటల్ కమాన్ దగ్గర ఉన్నటువంటి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సీతారామరాజు, షేక్ షాజహాన్, ప్రీతంరెడ్డి, కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రగతినగర్‌లో...**

**నిజాంపేట్, జులై 4, ప్రభాతవార్త :** సూర్యుడస్తమించని బ్రిటీష్ రాజ్యానికి చీకటిని పరిచయం చేసిన సూర్యవంశ యోధుడు, తన పాతికేళ్ల జీవితంతో నూరు తరాలకు ధైర్యాన్ని నూరిపోసిన భయమెరుగని తెలుగు వీరుడు, విప్లవ జ్యోతి, అడవితల్లి ఒడికి రారాజు, అల్లూరి సీతారామారాజు 127వ జయంతిని గురువారం ప్రగతినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్టెక్స్ సంస్థల అధినేత వి.వి.వర్మ విచ్చేసి అల్లూరి సీతారామారాజు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి ఆశయాలను నెరవేర్చడానికి ప్రజాసేవలో మనందరం ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్.ఎస్.రాజు, వేణుగోపాల్‌రాజు, కృష్ణంరాజు, గంటిసాయిరాజు, రామకృష్ణమరాజు, గుణరంజన్‌సాయి, భాస్కర్‌రాజు, శ్రీనివాసరాజు, అల్లూరి లక్ష్మీపతిరాజు, బాల చెన్నారెడ్డి, ప్రసాద్‌రాజు, పృథ్వీవర్మ, దాసి నాగరాజు, పోలిశెట్టి శ్రీనివాసరావు, అబ్దుల్ నబి, దాట్ల సతీష్‌రాజు, సుమన్‌రావు, దాట్ల వెంకటపతిరాజు, చక్రధర్, పద్మప్రసాద్, ప్రొఫెసర్ రఘురామరాజు, శివప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**సీతారాజునగర్‌లో...**

**జీడిమెట్ల, జులై 4, ప్రభాతవార్త :** సుభాష్‌నగర్ డివిజన్ అల్లూరి సీతారాజునగర్‌లో అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకలు కార్పొరేటరన హేమలత సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటరన హేమలత సురేష్‌రెడ్డి మాట్లాడుతూ అల్లూరి చేసిన కృషి, త్యాగాల ఫలితమే మన స్వతంత్ర్య భారతదేశం అని అన్నారు. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర పోషించాడని తెలిపారు. 20వ శతాబ్దం ప్రారంభంలో రంపా తిరుగుబాటుకు నాయకత్వం వహించడంలో ప్రసిద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, భిక్షపతి, గణేష్, సంతోష్, శ్రీకాంత్, మనోజ్‌వర్మ, సూరిబాబు, దుర్గారావు, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## డ్రైనేజీ,మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి


వాటర్ వర్క్స్ కార్యాలయంలోని నోటీస్ బోర్డుకు వినతి పత్రం అంటించిన హనుమాన్‌నగర్ పేజ్ మూడు బస్తీ వాసులు

**చార్మినార్,జూలై 4 ప్రభాతవార్త :** పాతబస్తీ హనుమాన్ నగర్ ఫేజ్ మూడు బస్తీలో డ్రైనేజీ,మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని బస్తీ వాసులు వాటర్ వర్క్స్ అధికారులను కోరుతున్నారు.డిఆర్‌డిఎల్‌లో ఉన్న వాటర్ వర్క్స్ కార్యాలయానికి బస్తీ వాసులు వినతి పత్రం అందజేయటానికి వెళ్లగా అధికారులు అందుబాటులో లేకపోవటంతో నోటీస్ బోర్డుకు అతికించారు.దాదాపు ఇరవై సంవత్సరాలు నుంచి ఛత్రినాక ప్రాంతాలు నుంచి వర్షం కురిసే సమయంలో వర్షం నీరుతో పాటు డ్రైనేజీ నిండి పోయి మురికి నీరు హనుమాన్ నగర్ ఫేజ్ మూడులో ప్రవహించటంతో నానా అవస్థలు పడుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడని బస్తీ వాసులు తెలిపారు.వర్షం పడే సమయంలో బస్తీలో మోకాలు లోతు వర్షం నీరు,మురికి నీరు పారుతుండటంతో డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు సోకేప్రమాదం ఉందని స్థానికులు తమ నిరసన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హనుమాన్ నగర్ ఫేజ్ మూడులో డ్రైనేజీ, మురుగు నీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు నర్సింగ్, హనుమంతు,అనిత,ప్రమోద్,చంద్రగిరి పాల్గొన్నారు.

## బోధన రుసుం బకాయిలు విడుదల చేయాలి

**చార్మినార్,జూలై 4 ప్రభాతవార్త :** గత మూడు సంవత్సరాలకు సంబంధించిన బోధన రుసుం బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ అహ్మద్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు.పాత బస్తీ షంషేర్‌గంజ్‌లో ఆయన మాట్లాడుతూ డిగ్రీకి సంబంధించిన 2020-21,2021-22,2022-23 విద్యా సంవత్సరాలకు రావలసిన బోధన రుసుం బకాయిలు విడుదల కానందున ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నారని తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి మూడు సంవత్సరాలకు సంబంధించిన బోధన రుసుంను విడుదల చేయాలని అసోసియేషన్ ఉపాధ్యక్షులు మహ్మద్ అహ్మద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

## విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు

### తెలంగాణ అడ్వకేట్ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి

**ముషీరాబాద్, జూలై 4, ప్రభాతవార్త:** తెల్ల దొరలను గడ గడ లాడించిన విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. గురువారం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న సీతారామరాజు విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా, తెలుగువారి సాహసానికి ప్రతీకగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో నిలిచిపోయారని, భావి తరాలకు ఆ మహనీయుని చరిత్రను తెలియచేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని అన్నారు.

## పరిశుభ్రతను పాటించని హోటళ్లపై దాడులు


బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని ఓ బేకరి నిర్వాహకుడికి రూ.9.వేలు జరిమానా విధిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్.

**నార్సింగి, జులై 4 ప్రభాతవార్త :** పరిశుభ్రతను పాటించని హోటళ్లు, బేకరీలపై దాడులు నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ తెలిపారు. మున్సిపల్ కమీషనర్ శరత్‌చంద్ర ఆదేశాల మేరకు అన్ని తినుబండారాల హోటళ్లపై దాడులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గురువారం బండ్లగూడలోని ఓ బేకరీపై దాడి చేయగా అక్కడ ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేస్తున్న తిను బండారాలు అమ్ముతున్నారని, అందుకే ఆ నిర్వాహకుడికి రూ.9.వేలు జరిమానా విధించామన్నారు. వర్షాకాలం సమయంలో అపరిశుభ్రమైన ఆహార పదార్థాలు తింటే వాంతులు, విరోచనాలు, విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, హోటళ్లు, బేకరీలు, చాయ్ బండ్ల వారు పరిశుభ్రతకు పెద్దపీత వేయాలని, లేదంటే పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తామని ఇన్‌స్పెక్టర్ నరేష్ హెచ్చరించారు. ఈ దాడులలో శ్రీశైలం, శ్రీనివాస్, ముదాస్సిర్ తదితరులు పాల్గొన్నారు.

### అల్లూరి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి

**సైఫాబాద్, జులై 4 ప్రభాతవార్త:** బ్రిటిష్ వారి గుండెల్లో నిదురించిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధు డు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువతరం అవినీతి, అక్రమాలపై ఉద్యమించాలని లోక్‌ద శ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర పి.వెంకటరాజేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. నేడు దేశంలో ఎక్కడ చూసిన అవి నీతి, అక్రమాలు రోజురోజుకు పెరిగి పోతున్నాయని అన్నారు. గురువారం అల్లూరి 127వ జయంతి కార్యక్రమం పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్ర మార్కుల గుండెల్లో యువత నిదురించాలని సూచించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటా : ఎమ్మెల్యే

**యూసుఫ్‌గూడ, జూలై 04, ప్రభాతవార్త**

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తామెప్పుడు అన్ని వేళల అందుబాటులో ఉంటామని ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. గురువారం వివేకానందనగర్ కాలనీ వార్డు కార్యాలయంలో జిహెచ్‌ఎమ్‌సి అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ సబీహాగౌసుద్దీన్‌తో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల కాలనీల నుండి సంక్షేమ సంఘాలు స్థానిక ప్రజలు వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని చెరువులలో గుర్రపు డెక్క ఎక్కువగా ఉండటం వలన రోజురోజుకు దోమల సమస్య ఎక్కువవుతుందని పిచికారి చే యాలని అధికారులను అదేశించారు. అదేవిధంగా రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఎలాంటి ఇబ్బం దులు పడకుండా డ్రైనేజి, రోడ్లు పనులు త్వరిత గతిన పూర్తిచేయాలన్నారు. సమస్యలు ఎన్ని ఉన్న వాటికి కావాలసిన నిధుల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.వాటి పరిష్కారానికి కావలసిన నిధులను జిల్లా మంత్రులతో కలిసి తీసుకువస్తామని అలసత్వం వహించ కుండా పనులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో డి.సి రమేష్, నియోజకవర్గం మైనార్టీసెల్ అధ్యక్షులు మహ్మద్ గౌసుద్దీన్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు లింగాల ఆయిలయ్య, ప్రధాన కార్యదర్శి పిల్లితిరుపతి, కోఆర్డినేటర్ వీరారెడ్డి, పార్వతమ్మ, ముత్యాల దుర్గతో పాటు వివిధ కాలనీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.


వివేకానందనగర్ వార్డు కార్యాలయంలో ప్రజా సమస్యలపై సమీక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు.

## 'వికసిత్ భారత్-హిందూ రాష్ట్రం' అంశంపై సదస్సు

**చిక్కడపల్లి, జులై 4 ప్రభాతవార్త:** విప్లవ రచయితల సంఘం(విరసం) ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం 'వికసిత్ భారత్-హిందూ రాష్ట్రం' అంశంపై సదస్సు యువకవులు, రచయిత్రులు రచించిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా అరుతార సాహిత్య, సాంస్కృతిక పత్రికలో సీరియల్‌గా వచ్చిన ముక్తవరం పార్థసారథి సాహిత్య వ్యాసం 'బాల్జాక్ జీవితం-సాహిత్యం' ఒక పరిచయం పుస్తకాన్ని బజ్రా జగదీశ్వర్‌రావు, కలలుచిగురిస్తాయి, పాలస్తీనా సంఘీభావ కవిత్వం పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించారు. అదే విధంగా మాటలే దేశద్రోహమైతే పుస్తకాన్ని ఎన్.వేణుగోపాల్, 'రాత్‌డలేగి' ఉర్దు కవిత్వాన్ని సిఎస్‌ఆర్.ప్రసాద్ ఆవిష్కరించారు. ఇదే సభలో అరుణతారప్రత్యేక కథల సంచిక 'కథల బండి' రూపా రుక్మిణి, రచయిత్రి కళావతి రచించిన 'సమాయత్త సమయం' కవిత్వాన్ని ప్రముఖ సాహితీవేత్త కె.శివారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నందినీ సిధారెడ్డి మాట్లాడుతూ పాలస్తీనాలో జరుగుతున్న మానవ హననానికి అక్కడ ప్రజల కన్నీళ్లకు బాధలకు, గాధలకు తెలుగు యువ కవులు అక్షరరూపం ఇచ్చారని అన్నారు. అంతకుముందు ఉదయం సుందరయ్య విజ్ఞానకేంద్రం వద్ద పతాకావిష్కరణ అనంతరం అరసవిల్లి కృష్ణ ప్రారంభోపన్యాసం చేశారు. రాంకీ అధ్యక్షతన వికసిత్ భారత్-హిందూ రాష్ట్రం అంశంపై వరలక్ష్మి, రాము అధ్యక్షతన జరిగిన 'హిందుత్వ కార్పొరేట్ కగార్ యుద్ధం' అంశంపై పాణి, శివరాత్రి సుధాకర్ అధ్యక్షతన జరిగిన 'ఫాసిస్టు వ్యతిరేక భవిష్యత్ రాజకీయ సాంస్కృతిక పోరాటాలు' అంశంపై రివేరా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విరసం నాట్య ప్రదర్శన, ప్రజానాట్యమండలి,అరుణోదయ సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.


పాలస్తీనా సంఘీభావ కవిత్వం పుస్తకాన్ని తెలంగాణ సాహిత్య అకాడమి పూర్వ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి ఆవిష్కరించిన దృశ్యం

## ఈదమ్మ, పోచమ్మ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు

### -ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో సమావేశం



**అత్తాపూర్ జూలై 4, ప్రభాతవార్త :** అత్తాపూర్ డివిజన్ హైదరగూడ చారిత్రక శ్రీశ్రీ ఈదమ్మ,పోచమ్మ దేవాలయం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గురువారం ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మంద్ర నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈనెల 28 ఆదివారం అశేష జనవామిని మధ్య కనుల పండుగగా వస్తాం నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.ఉదయం 7 గంటలకు ఘటాల ఊరేగింపుతో మొదలయ్యే బోనాల ఉత్సవాలు రాత్రి అమ్మవారి అఖండ హారతితో ముగుస్తుందని ప్రణవభక్త సమాజం అధ్యక్షుడు మొంద్ర నరసింహ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ప్రణవభక్త సమాజం బాధ్యులు బర్ల మల్లారెడ్డి,పుస్తకాల అశోక్,కొండమీద హరినాథ్, పుర ప్రముఖులు వివిధ రాజకీయ పార్టీ నాయకులు కొలను సుభాష్ రెడ్డి,నార గూడెం మల్లారెడ్డి,మాంద్ర కొమురయ్య, పెంటారెడ్డి, సాబాద విజయ్,వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సులిగ మహేందర్,ఉపాధ్యక్షుడు క్యాదం శివ కుమార్,సామాజిక కార్యకర్తలు,మధుసూధన,సహదేవ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## నెట్, నీట్ పరీక్షల స్కామ్‌లపై న్యాయ విచారణ జరపాలి



బషీర్‌బాగ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**సైఫాబాద్, జులై 4 ప్రభాతవార్త:** నెట్‌ను రద్దు చేయాలని, నెట్, నీట్ పరీక్షల స్కామ్‌లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఎఐడిఎస్‌ఓకి చెందిన అనేక మంది విద్యార్థులు గురువారం బషీర్‌బాగ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐడిఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌రాజ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు నితీష్ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతున్నప్పటికి కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు ఎంతో కష్టపడి చదవి, నిజాయితీగా పరీక్షలు రాస్తే అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. తక్షణమే పరీక్షలను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వం న్యాయం చేసేంతవరకు ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నాగరాజు, ప్రతిభ, శశాంక్, అభిషేక్, ప్రణవసిద్ధార్థ, విసి తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

**సైఫాబాద్, జులై 4 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమర వీరుడు దొడ్డి కొమురయ్య వర్థంతి కార్యక్రమం గురువారం నిజాం కళాశాల ప్రాంగణంలో జరిగింది. నిజాం కళాశాలలో బిసి సేల్ ఆధ్యర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.భీమా కొమరయ్య చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్-ప్రిన్సిపాల్ డా.జి.ఉపేందర్‌రెడ్డి, బిసి సేల్ కో-ఆర్డినేటర్ డా.సి.హెచ్.వెంకటేశ్వర్లు, దీకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్‌డ్రైవ్ పేరుతో ఆటోడ్రైవర్లపై వేదింపులు తక్షణమే ఆపాలి

**చిక్కడపల్లి, జులై 4 ప్రభాతవార్త:** ఫ్రీ బస్సుల స్కీం వల్ల నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న ఆటోడ్రైవర్లపై స్పెషల్‌డ్రైవ్ పేరుతో వేదింపులు తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) సిఐటియు అనుబంధం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం నుంచి బాగ్‌లింగంపల్లి మెయిన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర సహాయ కార్యదర్శి డిఎల్.మోహన్, నగరనాయకులు కె.రమేశ్, ఆటో యూనియన్ నాయకులు బి.మల్లేష్, కిరణ్, మెహన్దత్, ఆంజనేయులు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


మల్లంపేట్ నుండి జడ్పిహెచ్ఎస్ పాఠశాల దారి మధ్యలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ నీరు


మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఉన్న గోశాలలో గోవులకు జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్ ప్రత్యేక పూజలు చేశారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు రాజుయాదవ్,అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## రంజన శ్రీవాస్తవ మృతి తీరని లోటు

**బేగంబజార్,జూలై 3ప్రభాతవార్త:** తెలంగాణ నాన్ గజిటెడ్ఆఫీసర్స్ కేంద్రసంఘం పూర్వ మహిళా విభాగం చైర్‌పర్సన్ రంజన శ్రీవాస్తవ మృతి తీరని లోటని టిఎన్‌జి ఓ కేంద్ర సంఘం పూర్వ అధ్యక్షులు కె.స్వామిగౌడ్,సుధాకర్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. ముజీబ్‌హుస్సేనీలు పేర్కొన్నారు.ఆమె మరణవార్తను తెలుసుకుని ఆమె నివాసానికి చేరుకుని పార్ధివ దేహంపై పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు.పూర్వ అధ్యక్షులు దేవిప్రసాద్,సహఅధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు,ప్రచార కార్యదర్శి శైలజ, హైదరాబాద్ కోశాధికారి జె.బాల్‌రాజ్,సెంట్రల్అసోసియేషన్అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎంబి.కృష్ణాయాదవ్, హైదరాబాద్ సిటి అధ్యక్షులు శ్రీకాంత్,హరికృష్ణ తదితరులు ఆమె పార్ధివ దేహంపై పూలమాలలు వేసి నివాళ్లు ఆర్పించారు.తెలంగాణ ఉద్యమంలో ఆమె చేసినత్యాగాలను,సేవలను గుర్తు తెచ్చుకుని శ్లాఘించారు.ఆమె మరణం తీరనిలోటన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన సురేష్‌రెడ్డి

**జీడిమెట్ల, జులై 4, ప్రభాతవార**

సూరారం కాలనీ రాజీవ్ గృహకల్పలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సురేష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే చికిత్సకు వెళ్ళిన వారికి అన్ని సౌకర్యాలు అందిస్తున్నారా, టాబ్లెట్‌లు, వైద్య పరీక్షలు సరిగా చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు చేస్తున్న కృషి సేవ చాలా గొప్పది, దేవుని తర్వాత నమ్మేది ఒక డాక్టర్‌ను మాత్రమేనని అన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో బస్తీ దవఖానలను కూడా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, రాజీవ్ గృహకల్ప అధ్యక్షులు శివాజీ, వెంకట్‌రెడ్డి, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జిలతో గురుకుల ఉపాధ్యాయుల నిరసన

**సైదాబాద్, జులై 4 ప్రభాతవార్త:** గురుకులాల్లో కామన్ టైం టేబుల్ పేరిట ప్రభుత్వం తీసుకువచ్చిన జిఓ నెం.16ను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లోని ఉపాధ్యాయులు గురువారం నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అయిదు సొసైటీలు టిఆర్ఇఐఎస్, టిఎస్‌డబ్లుఆర్ఇఐఎస్, టిటిడ బ్లుఆర్ఇఐఎస్, ఎంజెపిటిబిసిడబ్లుఆర్ఇఐఎస్, టిఎంఆర్ఇఐఎస్‌ల ఆధ్వర్యంలో వెయ్యికి పైగా గురుకులాలు నడుస్తున్నాయి. వీటిలో దాదాపు 30 వేలకు పైగానే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. . మైనార్టీ, సాంఘీక, గిరిజన సంక్షేమ గురుకు లాలు ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతున్నాయి. బిసి గురుకులాలు మాత్రం 7.30కే ప్రారంభం అవుతున్నాయి. బిసి గురుకులాల సమయాన్ని కూడా 9 గంటలకు మార్చాలని చాలా కాలంగా ఉపాధ్యాయులు, సంఘాలు డిమాండ్ చేస్తు న్నాయి. అయితే అన్ని గురుకులాల ప్రారంభ సమయాన్ని ఉదయం 8 గంటలకు మారుస్తున్నట్లుగా ప్రభుత్వం నుంచి అకస్మాత్తుగా జిఓ విడుదల కావడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గురుకుల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు. విధ్యార్థులను, ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే జిఓను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ బడులును తీర్చిదిద్దాలి

### -బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న వేముల రామకృష్ణ తదితరులు

**హైదరాబాద్,జూలై 4,ప్రభాతవార్త:** కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దాలని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్‌లో చదివే పదోతగరతి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించి డిజిటల్ క్లాసులు బోధించాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. గ్రూప్ 1స్థాయి అధికారిని డిఈవోగా నియమించి ప్రతివారం విద్యార్థులతో కలిసి భోజనం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు ఐడెంటీకార్డు, సూట్లు, బూట్లను అందజేయాలన్నారు. అంతేకాకుండా కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి 10నవోదయ, 10 కేంద్రీయ విద్యాలయాలను మంజూరు చేయాలన్నారు. పక్కదేశాలు మన జ్ఞాన సంపదను దోచుకుంటే ..మనదేశంలో మాత్రం అవకాశాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కావున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్.కృష్ణయ్య నాయత్వంలో దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉదృతం చేస్తామని రామకృష్ణ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు బజార్ మౌలిక వసతులకు కృషి : సబితాఇంద్రారెడ్డి


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి కూరగాయలు అందజేస్తున్న రైతులు

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** రైతుబజార్లో రైతులు వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ రైతుబజార్‌ను గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నరసింహారెడ్డితో కలిసి కలియతిరిగి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలక్రితం నిర్మించిన రైతుబజార్ ఆధునికరించాలన్నారు. నూతన షెడ్లు ఏర్పాటు చేసి, వెలుతురు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అధికారుల కు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడుబండి వ్యాపారులకు రైతుబజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మార్కెట్లోని పలు సమస్యలను సబితకు వివరించి రైతులకు, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రైతులు కోరారు. బిజెఆర్ భవన్‌ను పరిశీలించి అత్యాధునిక వసతులతో ఆధునికరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అధికారి కుసుమ లావణ్యకు సూచించారు. ఎండాకాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోర్ వేయించడంతోపాటు, బీజేఆర్ భవన్‌లో కార్యక్రమాలు చేసుకునే నిర్వాహకుల కోసం వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఆధునీకరణ కోసం రూ.4కోట్లు మంజూరు చేశామని, పూర్తి వివరాలతో ఎస్టిమేషన్ వేసి తీసుకురావాలని లావణ్యకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఈఓ స్రవంతిరెడ్డి, డిఇ రవీందర్, మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి అరవింద్‌శర్మ, మార్కెట్ నాయకులు ఆకుల అరవింద్, పెండ్యాల నగేష్, శ్రీనివాస్‌రెడ్డి, కొంద్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, అంకిరెడ్డి, శ్యామ్‌గుప్త, మహేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రిషి, కంచర్ల శేఖర్, పెంబర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


పారిశుద్ధ్య విభాగం అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, జులై 4 ప్రభాతవార్త:** డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగ్గా ఉండాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని కృష్ణతులసినగర్ కమ్యూనిటీ హాల్‌లో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, బస్తీవాసులతో కలిసి ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న బోనాల పండుగను పురస్కరించుకుని ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని, అదేవిధంగా ఆలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, డంపింగ్ వాహనాలను అందుబాటులో ఉంచుకోవా లన్నారు. ఆలయ కమిటీలను, డంపింగ్ వాహనాలను అందుబాటులో ఉంచు కోవాలన్నారు. ఆలయకమిటీలను సంప్రదించి భక్తులకు ఇబ్బందులు కలుగ కుండా చూడాలని, బోనాల ఉత్సవాల ఊరేగింపులో సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉత్సవాల సమయంలో పారిశుద్ధ్య నిర్వహణ బాగుందని అధికారులు సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఇ వెంకటపతిరాజు, సూపర్‌వైజర్ గోవింద్‌రెడ్డి, జవాన్ రమేష్, ఎస్ఎఫ్ఎలు గణేష్, ముజీబ్, సుభాష్, కమిటీ సభ్యులు దేవేందర్, రవి యాదగిరి, అమిత్, లక్ష్మణ్, ఉమేష్, మురళి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ డ్రైనేజీ సమస్యకు పరిష్కారం : పన్నాల


ఓల్డ్ మల్లాపూర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పోరేటర్ పన్నాల

**నాచారం, జులై 4 ప్రభాతవార్త:** ఓల్డ్ మల్లాపూర్‌లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించామని కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కార్పోరేటర్ గురువారం ఓల్డ్ మల్లాపూర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడా రు. ఎన్నో ఏండ్లుగా ఉన్న డ్రైనేజీ సమస్య తీరినందుకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. సీసీ రోడ్లను త్వరలో వేయిస్తానని చెప్పారు. ఎలాంటి సమస్యలున్నా తాను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగుళ్ల శ్రీనివాస్ గౌడ్, పైళ్ల ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, చెరుకు నాగరాజు, శ్రీనివాస్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం : ఎఐఎస్ఎఫ్


విద్యా సంస్థల బంద్ కార్యక్రమంలో పాల్గొన్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

**తుర్కయంజాల్, జూలై 4 ప్రభాతవార్త:** నీట్, నెట్ పరీక్షల ప్రశ్న పేపర్ల లీకేజీలను నిరసిస్తూ వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌లో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి శివకుమార్ మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్ల లికేజ్ వలన నష్టపోయి ఆందోళన చెందుతున్న విద్యార్థుల కు, తల్లిదండ్రులకు పూర్తి స్థాయి భరోసా కల్పించడంలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైందని, దోషులను కఠినంగా శిక్షించాలని, పేపర్ లీకేజీ వలన నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్ మండల నాయకులు గండికోట శివ, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి : విద్యావతి


చిన్నారికి అక్షరాలను దిద్దిస్తున్న కౌన్సిలర్ విద్యావతి

**హయత్‌నగర్, జులై 4 ప్రభాతవార్త:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారుల కు, గర్భిణీలకు అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ వద్దేపల్లి విద్యావతివిజేందర్ రెడ్డి అన్నారు. వార్డుపరిధి శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువా రం ఆమె పోషన్ అభియాన్ వారోత్సవాలలో పాల్గొని చిన్నారులకు అక్షరా భ్యాసం, గర్భిణీలకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం చిన్నారుల బరువులను కొలమానం చేయించి సరైన పోషకాహారాన్ని చిన్నా రులకు అందించాలని వారి తల్లులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు శ్రీదేవి, ఆయా సునీత పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గ్యారంటీలన్నీ అమలు చేయాలి

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని గ్యారం టీల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని మహిళా మోర్చా నాయకు రాళ్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం రంగారెడ్డి జిల్లా అధ్య క్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో గురువారం బాలాపూర్ మండల తహసీల్దార్ కు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారంటీ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆరోపించా రు. ఎన్నికలకు ముందు మహిళలకు ప్రకటించిన నెలకు రూ.2500లను ఇవ్వడంతో జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. అదే విధంగా కళ్యాణలక్ష్మి చెక్కులతోపాటు ఇస్తామన్న తులం బంగారం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళలకు ఇస్తామన్న రూ.4 వేలను సైతం ఇవ్వాలని వార న్నారు. అదేవిధంగా ఇచ్చిన పింఛన్ల పెంపు, రూ.500లకు గ్యాస్ ఇవ్వాలని వారు తెలిపారు. లేని పక్షంలో మహిళామోర్చా ఆందోళనలు చేస్తున్నదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇందిరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు నివేదిత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిలక్ష్మి, కార్యదర్శులు కావ్య, శ్వేతలతో పాటు లత, శ్రీలత, అనిత, కావ్య, పద్మజ, సంగీత, మీనాక్షి, నాగమణి తదితరులతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్య స్కూల్ అఫ్ ఎక్సలెన్స్ స్కూల్‌కు అన్ని అనుమతులు ఉన్నాయి చైర్మన్ కార్తీక్

**వనస్థలిపురం, జులై 4 ప్రభాతవార్త :** బియన్‌రెడ్డినగర్ డివిజన్ సామనగర్‌లో 20 సంవత్సరాల క్రితం లక్ష్య స్కూల్ అఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించి, విద్య రంగంలో ఉండి, ఉన్నత విద్యాభ్యాసాలు చేసి, మంచి ఉద్దేశంతో, పాఠశాలను ప్రారంభించి ఆధునిక సౌకర్యాలతో విశాలమైన తరగతి గదులు, వృత్తి నైపుణ్యత కలిగిన క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో, అన్ని రకాల ప్రభుత్వ శాఖలఅనుమతులు తీసుకొని, అత్యున్నతమైన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యా ర్థులకు విద్యా బోధన జరిపేవిధంగా కృషి చేస్తున్నామని లక్ష్య స్కూల్ అఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ సోమవరపు కార్తిక్ గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. అందరికి విద్యను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశం తో తక్కువ ఫీజులతో విద్యను బోధిస్తునామన్నారు. కొంత మంది వ్యక్తులు దురుద్దేశపూర్వకంగా ధనాన్ని ఆశించి మా పై అసత్య ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసామని ఆయన తెలిపారు.

## బడ్జెట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలి


విద్యా డైరెక్టర్ నర్సింహారెడ్డికి అభినందనలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా వెలిసిన ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా (తెలం గాణ రికగ్నైజ్డ్ స్కూల్ అసోసియేషన్ మేనేజ్‌మెంట్) పాఠశాల విద్యా డైరెక్టర్ నరసింహారెడ్డిని కోరింది. డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నర్సిం హారెడ్డిని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్య దర్శి రమేష్ రావు, కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎ గుల్నాని, రాష్ట్ర సహ అధ్యక్షులు పల్లె వినయ్‌కుమార్‌గౌడ్, బోళ్ళ శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మెగాసిటీ కెవిఆర్ మూర్తి, జిల్లా ఉపాధ్యక్షురాలు లింగాల అనంతలక్ష్మి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛానిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు బడ్జెట్ పాఠశాలలను ప్రభుత్వం ఆదుకొని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి: కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

**హయత్‌నగర్, జులై 4 ప్రభాతవార్త:** విజయవాడ జాతీయ రహదారిపై హైవే బావర్చి ఎదురుగా కొనసాగుతున్న డ్రైనేజీ ట్రంక్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆయన ట్రంక్‌లైన్ పనులను పరిశీలించారు. ట్రంక్ లైన్ కృంగడం ద్వారా కొంతమేర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని... ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం ఆయన జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి కలిసి రాఘవేంద్ర కాలనీలో రెండు నెలలుగా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో సైతం సరైన ప్రెషర్ రావడం లేదని సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మాధవనగర్‌లో రోడ్డు పనులు ప్రారంభం

**సైదాబాద్, జూలై 4 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను గురువారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాధవ నగర్ కాలనీ, శ్రీనిధి కాలనీ, కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజిలో రోడ్ల నిర్మాణం కోసం రూ.93లక్షలు మంజూరయ్యాయని, దానిలో భాగంగానే మాధవనగర్ లో పనులు ప్రారంభమయ్యాయని, రెండు మూడు రోజుల్లో మిగిలిన పనులు కూడా ప్రారంభమవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, నాయకులు సుంకోజు కృష్ణమాచారి, రవి ముదిరాజ్, గోగి అంజిరెడ్డి, ఉమా మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల కామన్ టైం టేబుల్ జిఓను ఉపసంహరించుకోవాలి : టిఎస్‌డబ్లుఆర్టీఇఏ

**ఎల్బినగర్, జులై 4 ప్రభాతవార్త:** గురుకులాలలో కామన్ టైం టేబుల్ పేరిట విడుదల చేసిన జిఓను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని తెలంగాణా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్య క్షుడు సిహెచ్.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎన్.దయాకర్‌లు కోరారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఇబ్బందులను, వసతుల కొరతను పట్టించుకోకుండా ఉపాధ్యా యుల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగా పాఠశాలల ప్రారంభ సమయాన్ని ఉదయం 9 గంటలకు బదులుగా 8 గంటలకు మార్చడం సరికాదన్నారు. కొత్త టైం టేబుల్ అశాస్త్రీయమైనదని వారు పేర్కొన్నారు. అశాస్త్రీయమైన జిఓ నెం.16ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని వారు పేర్కొన్నారు.

## మౌలిక వసతులను కల్పిస్తాం : ఎమ్మెల్యే మర్రి


ఎమ్మెల్యేకు సమస్యలను వివరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

**మల్కాజిగిరి, జులై 4 ప్రభాతవార్త:** గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని భవాని నగర్‌లో నెలకొన్న మౌలిక వసతులను కల్పించాలని కోరుతూ మల్కాజిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని గురువారం భవానినగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కలిసారు. గత కొంతకాలంగా కాలనీలో మౌలిక వసతులతో పాటు సిసి రోడ్లు, డ్రైనేజీ ఇతర పనులు పెండింగ్‌లో ఉన్నాయని నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కాలనీవాసులు ఎమ్మె ల్యేను కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారాన్ని పూర్తి చేస్తారని హామీ ఇచ్చారు.

**మౌలాలి డివిజన్‌లో....** మౌలాలి డివిజన్ ఆర్టీసీ కాలనీలో జరుగుతున్న నూతన రోడ్డు పనులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మణ్, డిఈ మహేష్, ఏఈ మధురిమ, వాటర్‌వర్క్స్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ వెంకటేష్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు అమినుదిన్, భాగ్యనందరావు, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, మహేష్, సంతోష్ నాయుడు, ఆదినారాయణ, విజయ లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, శైలేందేర్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తాం : కార్పొరేటర్ గీత ప్రవీణ్


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, జులై 4 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటి మెంబర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మల్లికార్జున నగర్, మార్కండేయ టెంపుల్ వీధి, బాలేందర్‌షాపు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పురాతన సిసి రోడ్లతోపాటు, డ్రైనేజీ సమస్యలు పరిశీలించి నట్లు తెలిపారు. కొత్తగా వేయాల్సిన పైప్‌లైన్ పనులు పరిశీలించి త్వరలోనే పనులు చేపడుతామని తెలిపారు. మంజూరైన పనులు వెంటనే ప్రారంభిం చాలని, సిసి రోడ్లు వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మంజూరైన పనులు ప్రారంభిం చని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సూచించారు. పనులు రద్దు చేసి కొత్త పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీని యర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నాయకులు కొండల్‌రెడ్డి, అశోక్‌చారి, బింగి శ్రీనివాస్, కె.జగన్, బాలేందర్, కుమార్, నర్సింగ్, డిఇ నిఖిల్‌రెడ్డి, ఎఇ రాజ్‌కుమార్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ, వర్క్ ఇన్స్‌పెక్టర్ ఉపేందర్, కేదార్, బస్తీ నేతలు అనంతరెడ్డి, సంధ్యారాణి, విజయలక్ష్మి, రమ, లావణ్య, అండాలు, కళావతి, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న తొలి బోనం జాతర


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జయంత్‌రావు, దయానంద్ తదితరులు

**సైదాబాద్, జూలై 4 ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని శ్రీ కనకాల కట్టమైసమ్మకు కుమ్మర్ల తొలి బోనం జాతరను నిర్వహిస్తున్నట్లు కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్‌గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ అమ్మవారికి తొలి బోనం కుమ్మరులే సమర్పిస్తారని, ఇది అనాదిగా వస్తున్న ఆచారమన్నారు. మట్టి పాత్రలు చాలా శ్రేష్టమైనవని, ఆరోగ్యకరమని, అమ్మవారికి మట్టిపాత్ర బోనాన్నే సమర్పించాలని వారు కోరారు. కుల వృత్తి చేసుకునే కుమ్మరులకు ప్రభుత్వం అండగా నిలవాలన్నారు. బొకేలా బదులు మట్టిపాత్రలు బహుక రించడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ ఎగిరిశెట్టి వీరయ్య, ఉత్సవ కమిటీ మహిళా కన్వీనర్ రాధారపు లక్ష్మి, కార్యదర్శి జిల్లెల శంకర్, కో కన్వీనర్ నడికుడ అశోక్, కాసుల రవీందర్, మల్కాజ్‌గిరి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను సాధించడంలో శిక్షణ


విద్యార్థులకు శిక్షణను ఇస్తున్న కరస్పాండెంట్ శశాంక్ పాలోజు

**వనస్థలిపురం, జూలై 4 ప్రభాతవార్త :** న్యూ మాస్టర్ మైండ్ కళాశాల, బాదాంగ్ పెట్ లో ఇంపాక్ట్ పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనర్, మైండ్ కోచ్, వైదేహినగర్, వనస్థలిపురంలోని లిటిల్ ఫ్లవర్ గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ శశాంక్ పాలోజు, కాలేజ్ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గోల్ సెట్టింగ్ సెషన్ నిర్వహించారు. ఈ సెషన్ విద్యార్థులలో ప్రేరణ కలిగించడానికి, వారి లక్ష్యా లను సాధించడానికి పునాది వేసే విధంగా ఏర్పాటు చేసారు. సెషన్ ప్రారం భంలో శశాంక్ విద్యార్థులకు గోల్ సెట్టింగ్ యొక్క ప్రాధాన్యతను వివరించా రు. విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాలను ఎలా సాధించాలో, వాటిని ఎలా స్థిరంగా ముందుకు తీసుకెళ్ళాలో, సరైన ప్రణాళికలను ఎలా రూపొందించా లో వివరించారు. సెషన్‌లో పలు ఉదాహరణలు, మోటివేషనల్ కథలు ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంచడానికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. సెషన్ చివర్లో విద్యార్థులకు ప్రాక్టికల్ యాక్టివిటీస్ అందించారు. వీటి ద్వారా విద్యార్థులు తమకు స్వయంగా గోల్ సెట్టింగ్ చేయడం, వాటిని ప్రణాళికా రూపంలో ముందుకు తీసుకెళ్ళడం నేర్చుకున్నారు. విద్యార్థులు ఈ సెషన్‌ను ఎంతో ఉపయోగకరంగా ఉందని, శశాంక్ ప్రేరణతో తమ భవిష్యత్ లక్ష్యాల ను మరింత సులభంగా సెట్ చేయగలుగుతామని తెలిపారు.

## మీర్‌పేట్ మంత్రాల చెరువును సుందరీకరిస్తున్నాం: సబితా ఇంద్రారెడ్డి


మంత్రాల చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న సబితారెడ్డి

**సరూర్‌నగర్, జూలై 4 ప్రభాతవార్త:** సుందరీకరణ పనులు జరుగుతున్న మీర్ పేట్ మంత్రాల చెరువును ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడ జరిగిన పనులను, వాకింగ్ ట్రాక్ వారధిని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సుందరీకరణ పనుల్లో భాగంగా నంది విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కట్ట వెంబడి చెత్తా చెదారాన్ని తొలగించి కార్పెట్ గ్రాస్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా సందర్శకులు, వాకర్స్ కూర్చోవడానికి అవసరమైన బెంచీలను ఏర్పాటు చేయాలనీ కట్ట వెంబడి ఆహ్లాదాన్ని అందించే మొక్కలను పెంచాలన్నారు. చెరువులో మురికి నీరు కలువకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముడావత్ దుర్గ దీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమీషనర్ చంద్రశేఖర్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డిఇఇ వెంకన్న ఎఇఇ శ్రీనివాసు లు, ఎఫ్ఆర్ఓ సుధీర్, కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్‌గౌడ్, సిద్దాల అంజయ్య, పాలపర్తి విజయలక్ష్మి, బోయపల్లి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణానికి సహకరించాలి : చింతల


మొక్కలు నాటుతున్న సుధీర్‌రెడ్డి, అరుణాసురేంద్రనాథ్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జులై 4 ప్రభాతవార్త:** అమ్మ పేరుతో ఒక మొక్క నాటానని మీరు కూడా మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నా రు. నాగోల్ డివిజన్ గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, నాగోల్‌కార్పొరేటర్ అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ హాజరై మొక్కలను నాటారు. మనకు జన్మనిచ్చిన తల్లిని మనమంతా ప్రేమిస్తామని, అమ్మకు గుర్తుగా లేదా గౌరవార్థం ఒక మొక్కను నాటి ప్రకృతి పరిరక్షణకు నడుం బిగిద్దామని ఇదే మనం మన తల్లులకు ఇచ్చే గౌరవమన్నారు. మొక్కలు నాటాలనే ప్రచారం మన తల్లిని గౌరవించడమే కాకుండా భూమిని కాపాడుతుంది. గత దశాబ్దం లో సమిష్టి కృషి ద్వారా, భారతదేశంలో అపూర్వమైన అటవీ విస్తీర్ణం పెరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతల సురేంద్రనాథ్ యాదవ్, అనంతుల రాజారెడ్డి, సతీష్‌యాదవ్, చిరంజీవి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి : ఎన్వీఎస్ఎస్


అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**కుషాయిగూడ, జులై 4 ప్రభాతవార్త :** స్వాతంత్ర సమరయోధులు అలుపెరుగ ని వీరుడు భరతమాత ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు ఆశయాలను మరచిపోరాదని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని మీర్పేట్ ఎస్బిఐ కాలనీ డివిజన్లో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి బిజెపి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు మునిగంటి రామ్ ప్రదీప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామరాజు తెలుగు జాతికి చేసిన సేవలు నిర్వచనమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జేరిపోతుల ప్రబుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో టీన్స్ షెడ్డు నిర్మాణం ప్రారంభం


షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, జూలై 4 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో రేకులతో రథశాలనిర్మాణ పనులను, దుర్గామాత దేవాలయం నుంచి సంతోషి మాత దేవాలయం వరకు షెడ్డు నిర్మాణ పనులను దేవాలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి గురువారం కార్యనిర్వాణాధికారి శ్రీనివాసశర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఘుమారెడ్డి మాట్లాడుతూ దాత జాల యాదగిరి రెడ్డి సహకారంతో ఈ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు చీర తిరుమలేష్, మేక సురేందర్ రెడ్డి, గోగిరెడ్డి అంజిరెడ్డి, గూడూరు మధుసూధన్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, చేగోని సురేష్‌గౌడ్, మేకల యాదగిరి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, చిత్రంలో కార్పోరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాయకులు చిగుళ్ల శ్రీనివాస్, పర్వతాలు, నరసింహ్మ తదితరులు (తార్నాక, ప్రభాతవార్త)